క్లుప్తంగా

బాధితుడికి చేయూత



బాధితుడికి మందులు అందిస్తున్న సుధాకరరావు

మలికిపురం: లక్కవరానికి చెందిన వారణాసి దేవదాసు గుండె వ్యాధితో బాధపడుతున్నారు. గుండె పనితీరును సమతుల్యం చేసే ఫేస్ మేకర్ అమర్చాలని, దానికి సుమారు రూ.5 లక్షలు అవుతుందని డాక్టర్లు తెలిపారు. తాపీ పని చేసుకుని జీవిస్తున్న అతనికి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం గడిచే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో మానవతా మూర్తులు గ్రూపును సహాయం చేయమని ఆశ్రయించారు. దీంతో పాలకొల్లు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పాలకొల్లు తటవర్తి సుధాకరరావును సంప్రదించడంతో గురువారం దేవదాసుకు మూడు నెలలకు సరిపడా మందులు అందించారు. వాకర్స్ క్లబ్ కార్యదర్శి పీర్ సాహెబ్ మాస్టారు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సభ్యులు కర్రా కిరణ్‌కుమార్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



రాహుల్ గాంధీ పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ప్రసన్నకుమార్

రాజోలు: లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను గురువారం రాజోలులో నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో–ఆర్డినేటర్ సరెళ్ల ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాబోయే కాలంలో రాహుల్‌ను ప్రధాని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర కిసాన్ సెల్ కన్వీనర్ దేశినీడి ఉదయ భాస్కరరావు, మాజీ సర్పంచ్ తోటే ప్రతాప్, జిల్లా ఉపాధ్యక్షుడు అల్లూరు మధు రవి రామరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి శివశంకర్, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షుడు గొల్ల లతీష్, పోతుల సత్యనారాయణ, గంజి సుభాష్, పాలపర్తి విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దాట్లకు రావిశాస్త్రి సాహిత్య పురస్కారం



దాట్ల దేవదానంరాజు

యానాం: విశాఖపట్నంలోని రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఏటా అందించే ప్రతిష్టాత్మక రావిశాస్త్రి సాహిత్య పురస్కారానికి ప్రముఖ కవి, కథకుడు.. యానాంకు చెందిన దాట్ల దేవదానంరాజు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం ఆయనకు ఆ సంస్థ నుంచి సమాచారం అందింది. స్థానికతను జోడించి వైవిధ్యమైన కథలు రచించినందుకు గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ డీవీ సూర్యారావు లేఖలో పేర్కొన్నారు. జూలై 30న రాచకొండ విశ్వనాథశాస్త్రి జయంతి రోజున విశాఖ పౌర గ్రంథాలయంలో పురస్కార సభ జరుగుతుందని తెలిపారు. గతంలో రావిశాస్త్రి పురస్కారం స్వీకరించిన వారిలో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఓల్గా, విహారి, పాపినేని శివశంకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు ఉన్నారు. ఈ సందర్భంగా దాట్ల దేవదానంరాజు మాట్లాడుతూ, సాహిత్య జీవితంలో కథలపై ఇష్టాన్ని, ప్రేమనీ కలిగించిన రావిశాస్త్రి పేరున ఇస్తున్న ఈ పురస్కారం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ఈ సందర్భంగా సాహితీవేత్తలు పి.విష్ణుమూర్తి, శిఖామణి, వరుగు భాస్కరరెడ్డి, చింతా కొండలరావు, మధునాపంతుల, పానుగుమట్ల అశోక్ తదితరులు దాట్లకు అభినందనలు తెలిపారు.

పంట కాలువలోకి వ్యర్థాలు



దేవగుప్తం సెంటర్‌లో డ్రైనేజీని తలపిస్తున్న గుండెపూడి కాలువ

అల్లవరం: మండలంలోని ప్రధాన కాలువలైన అల్లవరం, దేవగుప్తం, బెండా కాలువలు డ్రైనేజీలను తలపిస్తున్నాయి. కాలువల పొడవునా టాయిలెట్ గొట్టాలు ఏర్పాటు చేసి మురుగు వ్యర్థాలను వాటిలోకి వదిలేస్తున్నారు. ప్రధాన కాలువలతో పాటు పిల్ల కాలువలు కూడా మురుగు వ్యర్థాలతో నిండిపోయాయి. ప్రస్తుతం కాలువల్లో నీరు లేకపోవడంతో ఎక్కడి మురుగు వ్యర్థాలు అక్కడే స్తంభించి దుర్గంధం వెదజల్లుతోంది. కాలువ గట్టు పొడవునా నడవాలంటే ముక్కు మూసుకోవాల్సిందే. డ్రైనేజీలైనా కాస్తోకూస్తో శుభ్రంగా ఉంటాయి. కాలువలు వాటికన్నా దారుణంగా దర్శనమిస్తున్నాయి. పంట కాలువలోకి టాయిలెట్ గొట్టాలు ఏర్పాటు చేసినా.. ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు. మురుగు వ్యర్థాలతో కాలువల నుంచి వెలువడే దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లోకి ఏర్పాటు చేసిన టాయిలెట్ గొట్టాలను తొలగించాలని కోరుతున్నారు.

కళాత్మకం.. ఉట్టిపడితే అద్భుతం

- కొబ్బరి పీచుతో అందమైన వస్తువుల తయారీ
- శిక్షణ పొందుతున్న 30 మంది మహిళలు



పీచుతో హ్యాండీ క్రాఫ్ట్స్‌పై శిక్షణ పొందుతున్న మహిళలు

మామిడికుదురు: శిక్షణ ఉంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు... కళాత్మకతతో అద్భుతాలు సృష్టించవచ్చు.. కొబ్బరి పీచుతో కళాత్మకమైన వస్తువుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. పాశర్లపూడిబాడవలో 216వ నంబర్ జాతీయ రహదారిని ఆనుకుని ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. గత నెల 30న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హ్యాండీ క్రాఫ్ట్స్ విభాగం డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్ పేరిట ఈ కేంద్రం పెట్టారు. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరమ్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ కొబ్బరి పీచుతో కళాత్మకమైన వస్తువుల తయారీపై మహిళలకు శిక్షణ ఇస్తున్నారు. పలు రకాల బొమ్మల తయారీపై మెళకువలు నేర్పుతున్నారు. ఈ నెల 29వ తేదీ వరకూ శిక్షణ కొనసాగుతుంది. గతంలో శిక్షణ పొంది ప్రభుత్వ గుర్తింపు కార్డు కలిగిన మహిళలను ఈ శిక్షణకు ఎంపిక చేశారు.

ఉపాధికి తోడ్పాటు

మహిళలు తమ స్వశక్తిపై ఆధారపడి తీరిక సమయాల్లో బొమ్మలు తయారు చేస్తూ తద్వారా ఉపాధి పొందాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ శిక్షణతో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలన్నది సంకల్పం. దీనికి అనుగుణంగా ఈ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కొబ్బరి తోటలకు ఎంతో ప్రసిద్ధి చెందిన కోనసీమలో ఈ కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా బహుళ ప్రయోజనం ఉంటుంది. మామిడికుదురు మండలంలో మహిళలు కొబ్బరి ఉత్పత్తులను కుటీర పరిశ్రమగా చేసుకుని ఇప్పటికే ముందడుగు వేస్తున్నారు. అటువంటి వారికి మరింత చేయూత అందించాలన్న లక్ష్యంతో శిక్షణ ఏర్పాటు చేశారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న మహిళలకు ఒక్కొక్కరికి రోజుకు రూ.300 స్టయిఫండ్ కూడా ఇస్తున్నారు. పాశర్లపూడి, అప్పనపల్లి, పెదపట్నంలంక గ్రామాలకు చెందిన మహిళలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు.

చక్కని బొమ్మల తయారీ



కొబ్బరి పీచుతో అందమైన ఎన్నో బొమ్మలు తయారు చేసే అవకాశం ఉంది. దీనిపై ఇంత వరకూ మాకు పెద్దగా అవగాహన లేదు. 20 రోజుల నుంచి మాకు ఇక్కడ శిక్షణ ఇస్తున్నారు. ప్రతి విషయాన్ని ఎంతో చక్కగా విశ్లేషిస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా మాకు ఎంతో మేలు జరుగుతుంది. చక్కటి బొమ్మలు తయారు చేసే అవకాశం మాకు కలిగింది. ఇక నుంచి మేము కూడా బొమ్మల తయారీ ద్వారా గణనీయమైన అభివృద్ధిని సాధిస్తాం.

–అడబాల లక్ష్మి, అప్పనపల్లి

స్వయంసమృద్ధి సాధిస్తాం



మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించే దిశగా కొబ్బరి పీచుతో బొమ్మల తయారీపై ఇస్తున్న ఉచిత శిక్షణ మాకు ఎంతో ఉపయోగపడుతుంది. దీనిని ప్రాంత మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను మరింతగా విస్తరించాలి. పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ మహిళలకు ఉపయోగపడే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆ అసోసియేషన్ సహకారం మరువరానిది.

–మద్దాల దేవి, పాశర్లపూడి

ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు..



కొబ్బరి పీచుతో ఆకట్టుకునే ఎన్నో బొమ్మలు తయారు చేయవచ్చు. ఇక్కడ ఉన్న సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటే మహిళలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. 20 రోజుల నుంచి బొమ్మల తయారీలో శిక్షణ ఇస్తున్నాం. మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఎంతో నేర్చుకోవాలన్న తపన ప్రతి ఒక్క మహిళలో కనిపిస్తోంది. వారు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది.

క్రిస్టీ మీనన్, శిక్షకురాలు, న్యూ ఢిల్లీ

అతిసార వ్యాధిని నివారిద్దాం



పెదపళ్లలో అతిసార నియంత్రణపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

ఆలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించి స్వచ్ఛమైన నీరు తాగడం ద్వారా అతిసార వ్యాధిని పూర్తిగా నిర్మూలిద్దామని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ అధికారులు ఎస్.లక్ష్మీస్నేహ, డి.సాయికిషోర్ అన్నారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు మండలంలోని ఆయా పీహెచ్‌సీల ఆవరణలో గురువారం అతిసార వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. చిన్నారి పుట్టినప్పటి నుంచి ఆరు నెలల లోపు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని, విటమిన్ ఏ సిరప్‌ను తాగించాలని, క్రమం తప్పకుండా రోటా వైరస్, తట్టు టీకాలను వేయించాలన్నారు. అలాగే పెద్దలందరూ భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

సూక్ష్మ పోషకాలతో నాణ్యమైన దిగుబడులు



అంబాజీపేటలో ఎరువుల డీలర్లకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

అంబాజీపేట: కొబ్బరి పంటకు ఉపయోగించే ఎరువులు, సూక్ష్మ పోషకాల వాడకంలో సమతుల్యత పాటిస్తే, నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో సొసైటీ ఎరువుల డీలర్లకు సర్టిఫికెట్ కోర్సు శిక్షణలో భాగంగా గురువారం స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్రంలో విజ్ఞాన యాత్రను, కొబ్బరి మొక్కల పోషణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొబ్బరి పంటకు అవసరమైన ప్రధాన, ద్వితీయ సూక్ష్మ పోషకాలు, మోతాదుల సమతుల్యతపై స్థానిక శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ.కిరీటి, డాక్టర్ నీరజ ప్రయోగాత్మకంగా వివరించారు. కొబ్బరిలో సేంద్రియ ఎరువుల వినియోగాన్ని వివరించి శిక్షకులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఏరువాక కేంద్ర కోఆర్డినేటర్ చల్లా నరసింహారావు మాట్లాడుతూ తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో పనిచేసే ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ కార్యక్రమాన్ని ఏరువాక కేంద్రంలో ఈ నెల 9 నుంచి ప్రారంభించామన్నారు. స్థానిక పరిశోధనా కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలను, జీవ నియంత్రణ పద్ధతులను శాస్త్రవేత్తలు వివరించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి మోసగించిన కూటమి

- హామీలను విస్మరించిన చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



కొత్తపేటలో 'జగన్ అంటే నమ్మకం- బాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి

కొత్తపేట: ఎన్నికల ముందు అనేక హామీలతో ప్రజలను నమ్మించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఇప్పుడు మాట మార్చుతుందని మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. 143 హామీలిచ్చి ఒక్కటీ అమలు చేయలేని నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానికంగా వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహం వద్ద బుధవారం రాత్రి జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో 'జగన్ అంటే నమ్మకం – చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే చేసిన అప్పు రూ.1.50 లక్షల కోట్లని, ఏం చేశారో.. లెక్కలు మాత్రం లేవన్నారు. దీనిపై ప్రజలు ప్రశ్నిస్తారనే భయంతో కూటమి ప్రభుత్వం రోజుకో డైవర్షన్ పాలిటిక్స్‌తో తప్పుదోవ పట్టిస్తుందని అన్నారు. పచ్చమీడియా చంద్రబాబుకు వత్తాసు పలుకుతూ ప్రజలను మోసం చేస్తోందని వ్యాఖ్యానించారు. సూపర్ సిక్స్ హామీల్లో స్త్రీశక్తి, ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, కొత్త పింఛన్ల ఇంత వరకూ అమలు చేయకపోవడం చంద్రబాబు చేతకాని పాలనకు నిదర్శమన్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్ పాలన పేరుతో రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్‌ను నిర్వీర్యం వస్థలోకి పంపించాడన్నారు. మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుంటే మహిళా హోం మంత్రి మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జ్ ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకుడు కర్రి నాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యుడు పేపకాయల బ్రహ్మానందం, రావులపాలెం యువజన విభాగం అధ్యక్షుడు జవ్వాది రవి, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజుకు జగ్గిరెడ్డి పరామర్శ



రాజమహేంద్రవరంలో వీర్రాజు మాతృమూర్తికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట: మాతృ వియోగంతో బాధపడుతున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును మాజీ ఎమ్మెల్యే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. వీర్రాజు మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి గురువారం రాత్రి రాజమహేంద్రవరంలో వీర్రాజు స్వగృహానికి వెళ్లి, ఆయన తల్లి ఈశ్వరమ్మ చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జగ్గిరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కర్రి నాగిరెడ్డి, వత్సవాయి కృష్ణంరాజు, సురేష్‌రాజు తదితరులు ఉన్నారు.

పలువురికి గన్నవరపు పరామర్శ

మామిడికుదురు: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన లూటుకుర్రు శివారు బాడిలంక వాసి బళ్ల నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గం కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. నాగేశ్వరరావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, చిక్కం బుజ్జిబాబు, తులా గోపాలకృష్ణ, బొంతు చందు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి..

పి.గన్నవరం: వై.కొత్తపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకుడు గుర్రం సత్యనారాయణ సోదరుడు తాతయ్య నాయుడు ఇటీవల ప్రమాదవశాత్తూ కిందపడి గాయాల పాలవడంతో గురువారం ఆయన్ని పి.గన్నవరం నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు పరామర్శించారు. అలాగే కె.ఏనుగుపల్లిలో ఇటీవల గాయపడి కోలుకుంటున్న పార్టీ నాయకుడు తోలేటి రాజా తండ్రి సాయిబాబును గన్నవరపు పరామర్శించారు. పార్టీ నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, యన్నాబత్తుల ఆనంద్, దొమ్మేటి దుర్గారావు, కత్తుల పెద్దిరాజు, పుచ్చకాయల శ్రీనివాసరావు, జీవీఎస్ నాయుడు, యల్లమెల్లి సత్యనారాయణ, గంధం కాశీ, కొల్లే శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్‌లో ఉచిత సీటు

కాజులూరు: ప్రతిష్టాత్మక వెల్లూర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) అమరావతిలో కాజులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి యాళ్ల సత్యఈశ్వర్‌కు బీటెక్‌లో ఫ్రీ సీటు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యశ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు గురువారం విద్యార్థి సత్యఈశ్వర్‌ను కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు అమరావతిలోని విట్ ద్వారా ఇంజినీరింగ్‌లో నాలుగేళ్లు ఉచిత విద్యను అందిస్తున్నారన్నారు. ఈ ఏడాది ఇంటర్‌లో 976/1000 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన తమ విద్యార్థి యాళ్ల సత్యఈశ్వర్‌కు కాకినాడ జిల్లా నుంచి బాలుర విభాగం నుంచి ఫ్రీ సీటుకు ఎంపిక కావటం గర్వించదగ్గ విషయమన్నారు.

ఉప్పునీటి సమస్యపై రైతుల వినతి

అమలాపురం టౌన్: తమ పొలాల్లోకి చొచ్చుకొస్తున్న ఉప్పునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉప్పలగుప్తం మండలానికి చెందిన రైతులు గురువారం అమలాపురంలో ఎంపీ గంటి హరీష్‌మాథూర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయానికి వచ్చిన రైతులు తమ సమస్యపై ఎంపీతో చర్చించారు. మెయిన్ డ్రెయిన్ నుంచి సముద్రంలో కలిసే కాలువ పూడుకుపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. గ్రామాల్లోని పొలాల్లోకి ఉప్పు నీరు చేరి పంట నష్టం కలగడమే కాకుండా, కొబ్బరి చెట్లు సైతం దెబ్బతింటున్నాయని అన్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. సమస్యను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకుని వెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు.

యోగాతో మానసిక ఉత్తేజం



జొన్నాడలో యోగాపై శిక్షణ ఇస్తున్న ఆనంద తీర్థాచార్యులు



యోగా సాధన చేస్తున్న మహిళా భక్త బృందం



అంబాజీపేటలో యోగా సాధనలో బోసుబాబు, తదితరులు

ఆలమూరు: యోగాతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉత్తేజం కలుగుతుందని, దీనికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి పడగాల ఆనంద తీర్థాచార్యులు తెలిపారు. జొన్నాడలోని శ్రీబొబ్బా చిన వెంకన్న కల్యాణ మండపంలో జరుగుతున్న శ్రీపురంధరదాసు సంకీర్తనల శిక్షణ తరగతులు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు. అలాగే మహిళ భక్త బృంద సభ్యులకు శిక్షణ పూర్తయిన అనంతరం ఆనంద తీర్థాచార్యులు స్థానిక యోగా శిక్షకులతో యోగాపై ప్రత్యేక అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాపై ప్రత్యేక దృష్టి సారించడం అభినందనీయమన్నారు. వయో భేదం, లింగ వివక్ష లేకుండా ప్రతి ఒక్కరూ దినచర్యగా యోగాను అభ్యసించాలని కోరారు. ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయ వ్యవస్థాపకుడు ఎం.ముకేందరస్వామి, మాజీ ఉప సర్పంచ్ తాడి శ్రీనివాసరెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొడవర్తి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

యోగా చేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం

అంబాజీపేట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా వ్యవసాయాధికారి, పి.గన్నవరం నియోజకవర్గ ప్రత్యేకాధికారి బోసుబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ జి.భీమరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న యోగా డేను నిర్వహించనున్నామన్నారు. ఆ రోజు భారీగా సామూహిక యోగా సాధన చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. నిత్యం యోగా చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అంతేకాకుండా వ్యాధులకు దూరంగా ఉంటామన్నారు. హెచ్‌ఎం కడలి సాయిరామ్, ఉపాధి హామీ పథకం ఏపీఓ ఏవీ కృష్ణ, పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి, సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

యోగా బొమ్మ.. బాగుందమ్మా



యోగా పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

మామిడికుదురు: ఈ నెల 21న యోగా దినోత్సవం సందర్భంగా ఈదరాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వేసిన యోగా పెయింటింగ్స్ ఆకట్టుకుంటున్నాయి. యోగా అంటే ఆరోగ్యం అనే నినాదంతో యోగాసనాలు, వాటి ప్రాధాన్యతను వివరిస్తూ 8వ తరగతి విద్యార్థులు ఈ పెయింటింగ్స్ వేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం జి.సాయిబాబు మాట్లాడుతూ యోగా ఒత్తిడిని తగ్గించి మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ జీవితంలో భాగంగా మలుచుకోవాలని సూచించారు. డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో విద్యార్థులు యోగాకు సంబంధించి అద్భుతమైన పెయింటింగ్స్ వేశారని అభినందించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

రాజోలు: శివకోటి గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.లలిత కుమారి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 24వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థులు ఈ నెల 25న ఉదయం 10 గంటలకు కాకినాడ సాంబమూర్తినగర్ గురుకుల పాఠశాలలో నిర్వహించే పరీక్షకు హాజరు కావాలన్నారు.